క్లుప్తంగా

పెళ్లికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ కలాబాయి -భిక్కు దంపతుల కుమార్తె జాదవ్ నిహారిక పెళ్లికి అబ్దుల్ రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ రెహమాన్ ఆదేశాల మేరకు సోమవారం ఫౌండేషన్ సభ్యుడు జాటోత్ దవీత్‌కుమార్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సునీల్, రాజేశ్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌ను గెలిపించాలి'



మాట్లాడుతున్న శాంతికుమారి

దహెగాం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి వై.అశోక్‌ను గెలిపించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ నేపథ్యం, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై అవగాహన, అనుభవం కలిగిన అభ్యర్థి అశోక్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్, సభ్యులు హరీశ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



తరగతులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చినరాస్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక క్లాసులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం కర్జి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల 132 కేవీ టవర్ లైన్ పనుల్లో భాగంగా మంగళవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. టవర్ లైన్ పనుల కారణంగా నేడు కౌటాల మండలం యాపలగూడ, కోయగూడ, గురుడుపేట, కన్నెపల్లి, కనికి, బోదంపల్లి, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్, బాబాపూర్, బాబాసాగర్, గంగాపూర్, చింతలమానెపల్లి, రుద్రాపూర్, బారెగూడ, పోతేపల్లి, కాటేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావ్ అన్నారు. సోమవారం మండలంలోని బాలేపల్లి గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడానికి సహకరిస్తామన్నారు. ఈ పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నాయని, మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డొంగ్రే మధుకర్, జాడి కుషాబ్‌రావ్, కార్తీక్, జగన్, సాగర్, అనిల్, సీడవన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు దూరంగా విద్యార్థులు

- పాఠశాలల్లో మైదానాలు కరువు
- కొన్నిచోట్ల వ్యాయామ ఉపాధ్యాయులు లేరు
- బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు



ఆట స్థలం లేని సిద్ధాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

బెజ్జూర్: విద్యార్థులు ఆటల్లో రాణించేలా గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు క్రీడా సామగ్రిని సైతం సమకూర్చింది. అయితే పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఆటలపై మక్కువ పెంచుకొని శారీరకంగా ఆరోగ్యంగా ఉండడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో చాలా మంది విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చుతున్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో సరైన ఆట స్థలాలు, క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడం, వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. వారిలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నారు.

అందని ప్రోత్సాహం..

జిల్లాలో 896 ప్రాథమిక పాఠశాలలు, 108 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 26మంది పీడీలు ఉండగా పీఈటీలు నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు ఎకరాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 5 ఎకరాల స్థలం ఉండాలి. కానీ జిల్లాలోని పలు పాఠశాలల్లో ప్రార్థన చేయడానికి కూడా స్థలం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఆటం స్థలం ఉన్నచోట విద్యార్థులకు మెలుకువలు నేర్పించే వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు ఆటల కోసం ప్రోత్సాహం కరవవుతోంది.

ఆట స్థలాలు కరువు..

జిల్లాలోని పలు పాఠశాలలకు ఆట స్థలాలు కరువయ్యాయి. విద్యార్థుల్లో క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికవుతున్నా వారికి మెలుకువలు నేర్పించే వ్యాయామ ఉపాధ్యాయులు, సరైన ఆట స్థలం లేకపోవడంతో వారికి ప్రోత్సాహం అందడం లేదు. కొన్నిచోట్ల స్థలాలు ఉన్నా ఆడించే వారు లేక విద్యార్థులు ఆటలపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం కాగా, మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అందులోని సౌకర్యాలు, పరికరాల జాడ లేక వాటిపై పర్యవేక్షణ కరువైంది. మైదానం లేని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు దోహదపడతాయని భావించినా వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చుతున్నారు. వారికి ఆటలు ఆడించే పీఈటీ లేకపోవడం, సరైన ఆట స్థలం లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులు క్రీడల్లో రాణించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటలతో సరదా..

పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థుల్లో ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి బాటలు వేస్తాయి. ఒక్కో ఆట ఒక్కో రకంగా విద్యార్థికి మేలు చేస్తుంది. ఆటల్లో జట్టుగా ఏర్పడటం ద్వారా సామాజిక సంబంధాలు మెరుగవుతాయి. అలాగే విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు ఆటలు దోహద పడతాయి. మైదానాల్లో పరుగులు తీయడం ద్వారా సమస్యలకు ఎదురు నిలిచి పోరాడే తత్వం అలవడుతుంది. నిత్యం కొంత సమయం పరుగుకు కేటాయిస్తే మంచిది. పోలీసు శాఖలోకి రావాలనుకునే విద్యార్థులకు పరుగు పందెం ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రార్థన చేయడానికే స్థలం లేదు



ఆటలు ఆడుకోవాలని ఉన్నా మా పాఠశాలలో ఆట స్థలం లేదు. దీంతో ఆటలు ఆడలేకపోతున్నాం. కనీసం ప్రార్థన చేయడానికి కూడా స్థలం లేదు. అధికారులు స్పందించి మాకు ఆట స్థలం కేటాయించాలి.

– కల్యాణి, 4వ తరగతి, చిన్న సిద్ధాపూర్ ప్రాథమిక పాఠశాల

ఆటలు ఆడిస్తున్నాం..

ఆట స్థలం ఉన్న చోట విద్యార్థులకు ఆటలు ఆడిస్తున్నాం. ఆట స్థలాలు లేని పాఠశాల విద్యార్థులకు కొంత ఇబ్బందిగా ఉంది. పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– సునీత, ఎంఈవో

'ఉపాధి' పనుల్లో భేష్!



తిర్యాణిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- లక్ష్యాన్ని అధిగమించిన 'తిర్యాణి'
- మండలంలో ఇప్పటి వరకు 3.59 లక్షల పనిదినాల కల్పన
- వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం ప్రణాళికలు సిద్ధం

తిర్యాణి: గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది పనుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఉపాధి పనుల్లో తిర్యాణి మండలం ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలోని కూలీలకు లక్ష్యానికి మించి 30శాతం అధికంగా పనిదినాలు కల్పించారు. ఈ పథకంలో భాగంగా పంట పొలాలు చదును చేయడం, కుంటల తవ్వకం, పంట పొలాలకు రోడ్లు నిర్మాణం, ఇంకుడు గుంతల తవ్వకం, నర్సరీల్లో మొక్కల పెంపకం, డంపింగ్‌యార్డ్ నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు.

వచ్చే ఏడాదికి ప్రణాళికలు సిద్ధం

2025 -26కు గాను చేపట్టబోయే ఉపాధి పనులకు సంబంధించి ఇప్పటికే శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి ప నుల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత ఆ ర్థిక సంవత్సరానికి గాను 3 లక్షల పైగా పనిదినాలను కల్పించి రూ.10 కోట్లు వేతనాలు చెల్లించేలా లక్ష్యం ఏర్పాటు చేసుకున్నారు. వీటితో పాటు కొత్తగా జాబ్‌కార్డులను పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

3 లక్షల 59 వేల పనిదినాలు పూర్తి

మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా ఉపాధిహామీ పథకానికి సంబంధించిన జాబ్‌కా ర్డులు కలిగిన కుటుంబాల సంఖ్య 7690గా ఉంది. ప్రస్తుతం 5667 జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉ న్నాయి. ఈ జాబ్ జార్డుల పరిధిలో 10,165 మంది కూలీలు ఉపాధి పనులు చేపడుతున్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 2.51 లక్షల పనిదినాలు చేపట్టాలని లక్ష్యం ఏర్పచుకోగా ఈఏడాది ముగిసేందుకు మరో నెల రోజుల ఉండగానే లక్ష్యానికి మించి ఉపాధి పనిది నాలు కల్పించారు. ఇప్పటి వరకు మండలంలో 3.59 లక్షల పనిదినాలను కల్పించగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

లక్ష్యాన్ని అధిగమించాం..

ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 10,165 మంది కూలీలకు 3.59 లక్షల పనిదినాలు కల్పించాం. సమష్టి కృషితో ఆర్థిక సంవత్సరం ముగియడానికి ముందే లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు అదనంగా లక్షకు పైగా పనిదినాలు కల్పించాం. వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం 3 లక్షల పైగా పనిదినాలను కల్పించాలనే లక్ష్యం పెట్టుకున్నాం. ఇందుకోసం ఇప్పటికే గ్రామసభలు ఏర్పాటు చేసి పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాం.

– షాకీర్ ఉస్మానీ, ఈజీఎస్ ఏపీవో, తిర్యాణి

ఘనంగా కేసీఆర్ జన్మదినం



వాంకిడి: వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: మాజీ సీఎం చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సందర్భంగా ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, స్వీట్లను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ యూత్ అధ్యక్షుడు బండి మహేశ్, రామిల్ల దేవాజీ, సతీశ్, గోపాల్, యాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: రాష్ట్ర మాజీ సీఎం చంద్రశేఖర్ రావు 71వ జన్మదినం సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

కౌటాల: మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ నేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌తోనే తెలంగాణ స్వరాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులు నాగపూరె బండు, నాయకులు ఉన్నారు.



పెంచికల్‌పేట్: బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు



కౌటాల: వేడుకలు జరుపుతున్న నాయకులు

కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

- అందవెల్లి వాగులో తాత్కాలిక రోడ్డు నిర్మాణం



వాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు



అందవెల్లి పెద్ద వాగు వంతెన వద్ద కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. 2021 సంవత్సరంలో భారీ వర్షాల కారణంగా పెద్దవాగులోకి భారీ వరదలు రావడంతో వంతెన కుంగిన విషయం తెలిసిందే. 2022 -23 సంవత్సరంలో మరోసారి భారీ వరదలు రావడంతో కుంగిన వంతెన మరింత కుంగి కూలిపోయింది. దీంతో భీమిని మండలం, దహెగాం మండలాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన కూలడంతో వంతెన నిర్మాణానికి సుమారు రూ.13.50 కోట్లు మంజూరు కావడంతో వంతెన పనులు గత సంవత్సరం పూర్తి చేశారు. అప్రోచ్ పూర్తి చేయక పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున ఎమ్మెల్యే హరీశ్ బాబు వంతెన వద్ద ధర్నా చేయడంతో తాత్కాలికంగా మట్టితో అప్రోచ్ రోడ్డు వేసి రాకపోకలు సాగించారు. ప్రస్తుతం గత నాలుగు రోజుల క్రితం అప్రోచ్ నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో రవాణా కష్టాలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వాగులో పైప్‌లు వేసి రోడ్డు నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మట్టి రోడ్డుపై నీరు పట్టాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో 15రోజుల వరకు ప్రయాణ కష్టాలు తప్పేలా లేవని పలువురు పేర్కొంటున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



పరీక్షప్యాడ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలని స్వేరోస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ అన్నారు. సోమవారం కౌటాల కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే ఉద్దేశంతో సుప్రీం స్వేరో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నియోజకవర్గంలో ఉచితంగా 20 కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేద విద్యార్థులు కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని గురుకులాలు, నవోదయ పాఠశాలల్లో సీటు సాధించాలన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కౌటాల: గ్రామీణ ప్రజలు మూఢనమ్మకాలు వీడనడాలని ఎస్సై మధుకర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తాటిపల్లి గ్రామంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయవద్దని, యువత, పిల్లలు సెల్‌ఫోన్లకు బానిస కావొద్దన్నారు. ఆధునిక కాలంలో డిజిటల్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక పనులు చేస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చెత్తాచెదారం తొలగింపు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధి జుబ్లీ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారం, కూరగాయల వ్యర్థాలను సోమవారం జీపీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. వారు మాట్లాడుతూ రాజంపేట గ్రామ పంచాయతీకి పారిశుద్ధ్య కార్మికులను, ట్రాక్టర్‌ను ప్రభుత్వం కేటాయించలేదని ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు కార్మికులతో చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. పంచాయతీ సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

తీగలు సరి చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగల కోసం కర్రను స్తంభంగా ఏర్పాటు చేసి పైకి లేపారు. దీంతో 'సాక్షి'లో 'కర్ర'ంట్ స్తంభం శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ స్పందించి మంగళవారం కర్రను తొలగించి వేలాడుతున్న తీగలను సరి చేశారు. ఈ సందర్భంగా త్వరలోనే ఎత్తుగా ఉన్న స్తంభం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ తీగలు సరి చేస్తున్న సిబ్బంది

నేడు కేశవనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యనిర్వాహక అధికారి వేణుగోపాల్‌గుప్తా, ఆలయ ప్రధాన అర్చకులు ఒజ్జల నరేశ్ శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు మనోజ్‌కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు నిత్యపూజ, అభిషేకం, 8 గంటలకు పుణ్యాహవచనము, ధ్వజారోహణం, 9 గంటలకు నవగ్రహ మండపారాధన, 10 గంటలకు పరివార సమేత కేశవనాథ స్వామి మూల మంత్రం హోవనము, మధ్యాహ్నం 12 గంటలకు బలిప్రదానం, 12.30 గంటలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 19వ తేదీ బుధవారం నిత్యపూజలతో పాటు ఉదయం 10.30 గంటల నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని, అనంతరం మంగళహారతి, మహామంత్రపుష్పం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

షెడ్డు తొలగింపు



షెడ్డును తొలగిస్తున్న సిబ్బంది

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ సమీపంలో అక్రమంగా వెలిసిన షెడ్డును అటవీ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం తొలగించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన అటవీ శాఖ కార్యాలయం సమీపంలో అక్రమంగా షెడ్ వెలియడంతో కృష్ణపెల్లి డిప్యూటీ రేంజర్ శ్రావణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాంలు తొలగించారు.